ప్రజల కోసం..

పేదలకు మెరుగైన వైద్యసేవలు

మనుబోలు: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల, 104 వాహన సేవలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 104 సేవలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఆపదలో ఉన్న వారికి సత్వరమే వైద్య సాయం చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, ఏపీఎంఎస్ డీసీడీ ఉమాశంకర్, ఎంపీహెచ్ఎస్ రమ్య తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ సుబ్బరాజుతో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఘన నివాళి

శంకరంబాడి సుందరాచారి జయంతి

వెంకటాచలం: మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతిని గురువారం మండలంలోని సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సుందరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతంతో సుందరాచారి రాష్ట్ర వైభవాన్ని చాటారన్నారు. ఆయన అనేక రంగాల్లో రాణించారని కొనియాడారు. రచయితల్లో శంకరంబాడికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.


నివాళులర్పిస్తున్న డైరెక్టర్ తదితరులు

భవిష్యత్ బాగుండాలని..

పిల్లల్ని బాగా చదివించాలి

ముత్తుకూరు: పిల్లలను పనులకు పంపొద్దని, వారిని బాగా చదివించాలని ఎంఈఓ మధుసూదన సూచించారు. ముత్తుకూరు పంచాయతీలోని చలివేంద్ర కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. బడి బయట పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. పిల్లలు వాటిని సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో రాణించాలన్నారు. సమయం వృథా చేయడం, చెడుస్నేహాలకు అలవాటు పడడం వల్ల అధిక నష్టాలు ఉంటాయన్నారు. పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా, పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన

క్లుప్తంగా

13న బ్యాడ్మింటన్ టోర్నీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ సహకారంతో యూరో కిడ్స్ పాఠశాల ఆధ్వర్యంలో ఈ నెల 13న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో నెల్లూరు - తిరుపతి జిల్లాల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఆలపాటి సంధ్యాదేవి తెలిపారు. గురువారం స్థానిక బీవీనగర్‌లోని ఆ పాఠశాలలో టోర్నీకి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ టోర్నీ అండర్-11, 15 బాలబాలికలు, 45 నుంచి 45 సంవత్సరాల పైబడిన పురుషులకు సింగిల్స్, డబుల్స్‌లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(టౌన్): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 49 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం స్థానిక మాగుంటలేవుట్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జెండాను రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమాల ద్వారా ఉపాధ్యాయ జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శేషు, చలపతిశర్మ, కోశాధికారి మురళీధరరావు, కార్యదర్శి సురేంద్ర, సీనియర్లు భాస్కర్, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా వినియోగదారుల నుంచి రేషన్ కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న ఎండీయూ ఆపరేటర్‌పై విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారుల బృందం గురువారం వెంగళరావ్‌నగర్‌లోని ఏ-బ్లాక్‌లో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో ఉండాల్సిన సరుకుల కన్నా రూ.54 వేల విలువ చేసే 1,150 కేజీల బియ్యం, 204 ప్యాకెట్ల పంచదార, 90 ప్యాకెట్ల గోధుమపిండి ఉండడంతో వాటిని అధికారులు సీజ్ చేశారు. ఎండీయూ ఆపరేటర్ సుల్తాన్‌బాషాను వివరణ కోరగా కార్డుదారుల నుంచి రేషన్ సరుకులు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆపరేటర్‌పై కేసు నమోదు చేయాలని నెల్లూరు రూరల్ సీఎస్ డీటీ కె.చంద్రలీల వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమిరెడ్డీ దిగజారుడు రాజకీయాలు మానుకో


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

• వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

పొదలకూరు: టీడీపీ నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు హితవు పలికారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని నావూరుపల్లి దళితవాడకు చెందిన రంగయ్య, పొండయ్య, నేదురుమల్లి గ్రామానికి చెందిన ఉడతా వెంకటరత్నంకు సోమిరెడ్డి బలవంతంగా టీడీపీ కండువాలు వేసినట్లు పేర్కొన్నారు. నావూరుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు చొప్పా రమేష్ మాట్లాడుతూ తమ గ్రామ దళిత కాలనీలో ఇద్దరు వృద్ధులకు మాయమాటలు చెప్పి టీడీపీ కండువాలు వేశారన్నారు. వెంటనే వారు సోమిరెడ్డి చేష్టలను ఖండిస్తూ తాము వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెప్పే చంద్రమోహన్‌రెడ్డి దొడ్డిదారిన మంత్రి పదవిలో కొనసాగి అదే పద్ధతిలో పార్టీలోకి కార్యకర్తలను లాక్కోవాలని చూస్తున్నట్లు విమర్శించారు. ఉడతా వెంకటరత్నం కుమారుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ తన తండ్రిని మభ్యపెట్టి టీడీపీ కండువా వేశారని, ఊపిరి ఉన్నంత వరకు తాము వైఎస్సార్‌సీపీలో ఉంటామని వెల్లడించారు. పొదలకూరు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డి రాజకీయ జీవితం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సర్వేపల్లిని నందనవనంగా మార్చిన ఘనత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు జి.శ్రీనివాసులు, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, ఎస్కే అంజాద్, గాలం హరి, ఉడతా సురేష్, ఎం.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తి లేదు'

వెంకటాచలం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీని తాము వీడే ప్రసక్తి లేదని మండలంలోని కురిచెర్లపాడు పంచాయతీ ఇస్లాంపేట గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు తెలిపారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. తాము దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులమని చెప్పారు. వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంట ఉన్నామని తెలిపారు. అయితే తమ గ్రామంలో నాలుగు రోజుల క్రితం మసీదు వద్ద నుంచి తాము వస్తుండగా, బలవంతంగా టీడీపీ కండువాలు కప్పి ఆ పార్టీలో చేరినట్లుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించుకున్నాడని తెలిపారు. వరుస ఓటములతో దిక్కుతోచని స్థితిలో ఉన్న సోమిరెడ్డి తన ఉనికి కోసం నీచ రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎవరికీ సాధ్యం కాని విధంగా కాకాణి అభివృద్ధి పనులు చేయిస్తున్నారని కొనియాడారు.


వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కార్యకర్తలు

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జూడో పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జూడో జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పురుషులు, మహిళల జూనియర్, సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనం రంగమయూర్‌రెడ్డి, కిశోర్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కొత్త జిల్లాల వారీగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 350 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. జాతీయస్థాయి పోటీలకు హాజరయ్యే జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి వెంకట శశిధర్, ఉపాధ్యక్షుడు ముసావీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

'గడప గడపకు' వాయిదా

కోవూరు: ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డికి జ్వరం తీవ్రంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి నాలుగురోజులపాటు విరామం ఇచ్చారు. తిరిగి సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీ నుంచి వడ్లమూడి సస్పెన్షన్

కొడవలూరు: మండలంలోని పాతవంగల్లుకు చెందిన వడ్లమూడి నరేంద్రను వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయన్ను తీసేసినట్లు తెలియజేశారు.

తల్లిదండ్రుల సమావేశం

ముత్తుకూరు: మండలంలోని జెడ్పీ హైస్కూల్లో గురువారం ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ పిల్లల చదువులపై శ్రద్ధ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. బడుల నుంచి ఇళ్లకు చేరే విద్యార్థులు ఏ మేరకు చదువుకుంటున్నారో పర్యవేక్షణ చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, స్కూళ్ల అభివృద్ధి తదితర అంశాలపై తల్లిదండ్రులతో మాట్లాడారు.

బాబా మందిరంలో విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భజన జరిగింది.

క్యాన్సర్‌పై అవగాహన


కనకమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని క్యాన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ జి.కన్యాకుమారి, గైనకాలజిస్ట్ డాక్టర్ టి.లక్ష్మి తెలిపారు. మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. తొలుత ఆశ్రమంలోని గాంధీ, స్థల దాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కోర్ కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, మంజుల, డైట్ కళాశాల అధ్యాపకులు నరసింగరావు, విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

కోవూరు: గ్రామ పంచాయతీల్లోని వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. నియోజకవర్గంలోని కోవూరులో పాటూరు ఒకటో వార్డుకి 3 నామినేషన్లు, ఇనమడుగు ఒకటో వార్డుకి 2 నామినేషన్లు వచ్చాయి. కొడవలూరు పాతవంగల్లులో 2 వార్డులకు 5, గౌతమ్‌నగర్ రెండు వార్డుల్లో 2 నామినేషన్లు వచ్చాయి. విడవలూరులో వరిణి, వావిళ్ల గ్రామాల్లో వార్డులకు ఈనెల 19న ఎన్నికలు జరుగుతాయి. ఈ నెల 19న ఆయా వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఆరోజే ఫలితాలు వెల్లడిస్తారు.

మనుబోలు మండలంలో..

మనుబోలు: మండలంలోని మనుబోలు, మడమనూరు, బండేపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లోని నాలుగు వార్డులకు ఉప ఎన్నికల కోసం గురువారం అభ్యర్థులు 14 నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. మనుబోలులో 4, మడమనూరులో 5, బండేపల్లి 3, చెర్లోపల్లిలో 2 నామినేషన్లు వచ్చాయన్నారు. మనుబోలు 4వ వార్డుకు చింతల శేషమ్మ, పరిమళ ఆదిలక్ష్మి, కనిమెల ప్రియాంక, చీళ్ల వెంకటరమణమ్మ, మడమనూరు 7వ వార్డుకు ఉప్పు దేవసేనమ్మ, ఉప్పు లక్ష్మమ్మ, తురక మంజుల, తురక అంకమ్మ, తురక లావణ్య, బండేపల్లి 3వ వార్డుకు ఆవుల రమణమ్మ, మేకల ప్రవల్లిక, మేకల నిర్మల, చెర్లోపల్లి 8వ వార్డుకు చేడిమాల వెంకటసుబ్బారెడ్డి, వల్లూరు శ్రీనివాసులురెడ్డి నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ రాధాకృష్ణ తెలిపారు.

వెంకటాచలం మండలంలో..

వెంకటాచలం: మండలంలోని కురిచెర్లపాడు పంచాయతీ 8వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి గురువారం నామినేషన్ దాఖలైంది. పఠాన్ మస్తాన్‌బీ అనే మహిళ గ్రామ సచివాలయంలో నామినేషన్ అందజేశారు.

కొడవలూరు మండలంలో..

కొడవలూరు: మండలంలోని గౌతమ్‌నగర్‌లో 3, 6 వార్డులకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు మాత్రమే ఒక్కొక్క నామినేషన్ వంతున గురువారం దాఖలు చేశారు. దీంతో ఇక్కడ రెండు వార్డుల్లోనూ అభ్యర్థులు ఏకగ్రీవం కానున్నారు. పాతవంగల్లులో 2, 3 వార్డులకు గానూ 2వ వార్డులో రెండు నామినేషన్లు, 3వ వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ఒక్కరే నామినేషన్ చేశారు. దీంతో 3వ వార్డులో అభ్యర్థి ఏకగ్రీవం కానున్నారు. రెండో వార్డులో మాత్రమే పోటీ నెలకొనే అవకాశం ఉంది. కార్యక్రమంలో ఎన్నికల అధికారి సీహెచ్ఎస్ లక్ష్మి, సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్, నాయకుడు బండ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వార్డులకు..

తోటపల్లిగూడూరు: మండలంలో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ కోవెరపాళెం పంచాయతీలో ఆరో వార్డుకు సంబంధించి ఒకటి, పేడూరు పంచాయతీలో 8వ వార్డుకు ఒక నామినేషన్ వచ్చిందన్నారు. శుక్రవారం స్క్రూటినీ నిర్వహిస్తామన్నారు. 14వ తేదీన పోటీలో ఉన్న అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు.

పొదలకూరు మండలంలో..

పొదలకూరు: మండలంలో చివరిరోజున గురువారం పంచాయతీ వార్డులకు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు. దుగ్గుంట పంచాయతీ వార్డుకు ఒకటి, బిరదవోలు వార్డుకు 2, విరువూరు వార్డుకు 2, నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు.

ఇందుకూరుపేట మండలంలో..

ఇందుకూరుపేట: మండలంలోని కుడితిపాళెం తొమ్మిదో వార్డుకు ఇద్దరు వ్యక్తులు నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి విజయభాస్కర్‌రెడ్డి గురువారం తెలిపారు.


కోవూరు : పాటూరులో నామినేషన్ వేస్తున్న దృశ్యం


మనుబోలు: నామినేషన్ దాఖలు చేస్తున్న పరిమళ ఆదిలక్ష్మి


కొడవలూరు: గౌతమ్‌నగర్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి


పొదలకూరు: విరువూరులో నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రల పంపిణీ

ముత్తుకూరు: మండలంలో గురువారం డీవార్మింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ అధికారులు మాట్లాడుతూ మండలంలో మొత్తం 72 ప్రభుత్వ పాఠశాలలు, 14 ప్రైవేట్ పాఠశాలలు, 73 అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హులైన చిన్నపిల్లలు 14,956 మంది ఉన్నారని, వీరి కోసం ప్రభుత్వం 16,400 ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసిందన్నారు. పాఠశాలల్లో హెచ్ఎంలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు మాత్రలు వేశారు.

• పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు గురువారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలను ప్రిన్స్‌పల్ కె.విష్ణువర్ధన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జనార్దనరావు, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

• కోవూరు: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు.

• బుచ్చిరెడ్డిపాళెం: మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం నులిపురుగుల నివారణ మందులను అందజేశారు. ఎంపీడీఓ పెంచల శ్యామ్, ఎంఈఓ దిలీప్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అస్వస్థత

నులిపురుగుల నివారణ మందు వేసుకున్న వారిలో పదిమంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలోని వివేకానంద పాఠశాల్లో గురువారం జరిగింది. జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుడు అహ్మద్‌బాబు కథనం మేరకు ఆ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు వేసిన అరగంట తర్వాత కళ్లు తిరగడం, కడుపునొప్పి రావడం, వాంతులు కావడంతో వారిని వెంటనే బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందించామన్నారు. కడుపులో ఎక్కువగా నులిపురుగులు ఉండడం, ఇతర కారణాలతో అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన తెలిపారు.

• తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ వసుమతి మాట్లాడుతూ చిన్నారుల్లో నులిపురుగులను నివారించేందుకు వైద్యశాఖ ఆల్బెండాజోల్ మాత్రలు అందజేసిందన్నారు. వరిగొండ, కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 10,545 మంది చేత మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హేమలత, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కొడవలూరు: కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో 8,500 మందికి గానూ ఒక్కరోజే 8 వేల మందికి మాత్రలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాలచంద్రబాబు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్ఎస్ రామ్మోహన్, హెచ్‌వీ సుజాత, హెచ్ఏ షఫీ ఉద్దీన్, ఏఎన్ఎం సుభాషిణి పాల్గొన్నారు.

• ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదెమ్మ సత్రం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల మందులను గురువారం పంపిణీ చేశారు. ఆర్‌బీఎస్‌కే డాక్టర్ సుధీర్‌కుమార్, పీహెచ్‌సీ డాక్టర్ బ్రహ్మేశ్వర్, సూపర్‌వైజర్ రమ పాల్గొన్నారు.


ముత్తుకూరు: విద్యార్థినికి మాత్రలు వేస్తున్న దృశ్యం


పొదలకూరులో..


కోవూరు: ఇనమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో..


బుచ్చిరెడ్డిపాళెంలో..


కొడవలూరులో..

గ్రామాల్లో నా భూమి - నా దేశం

కొడవలూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గ్రామాల్లో నా భూమి - నా దేశం కార్యక్రమాలు జరుగుతున్నాయి. మండలంలోని గండవరంలో గురువారం శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఆ తర్వాత భారతదేశాన్ని నిర్మించడంలో తమవంతు పాత్ర పోషిస్తామని, వలసవాద మనస్తత్వ జాడను తొలగిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాజకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి, మహిళా పోలీస్ శిరీష, ఇంజినీరింగ్ సహాయకులు డి.వినోద్‌కుమార్, వీఏఏ టి.కవిత, ఉపాధ్యాయులు కె.సురేష్, శివ నాగబాబు, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

గంగవరంలో..

కోవూరు: మండలంలోని గంగవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నా భూమి - నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత సైనికాధికారి నారేడ్ల రాజ్‌కుమార్‌ను సన్మానించారు. సర్పంచ్ యెడెం లక్ష్మీకుమారి మాట్లాడుతూ భారత సైన్యంలో 25 సంవత్సరాలు విశిష్ట సేవలు అందించిన వ్యక్తి మన గ్రామవాసి కావడం గర్వకారణమన్నారు. కార్గిల్ యుద్ధం, ఇంకా అనేక విపత్కర పరిస్థితుల్లో వెన్ను చూపకుండా దేశం కోసం పనిచేసిన వ్యక్తి రాజ్‌కుమార్ అన్నారు. ఆయనకు సర్పంచ్ సొంత నిధుల నుంచి బహుమతి అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగపట్నం కరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అడపాల శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విడవలూరులో..

మండలంలోని దండిగుంట గ్రామంలో గురువారం నా భూమి - నా దేశం కార్యక్రమం జరిగింది. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీఓ సోఫియా, టెక్నికల్ అసిస్టెంట్ ఇలియాజ్, సర్పంచ్ సుప్రజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, వీఆర్వో సుబ్బయ్య, ఎస్.రవికుమార్, నాయకులు మస్తానయ్య, వినయ్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

• పొదలకూరు: స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్లో గురువారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ సెక్రటరీ ఎస్కే అల్లాభక్షు, వార్డుసభ్యులు ఎస్కే అంజాద్, వాసు తదితరులు పాల్గొన్నారు.

• ఇందుకూరుపేట: మండలంలోని నిడిముసలి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నా భూమి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పావని పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొడవలూరు: గండవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అధికారులు


కోవూరు: రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మీకుమారి


పొదలకూరు మండలంలో..


విడవలూరు మండలం దండిగుంటలో..